
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



‘పెదవాగు’లో కబ్జా!

అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్ శిఖంలో వందల ఎకరాల భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. 8లో



..మావోయిస్టు లొంగుబాటు

మావోయిస్టు పార్టీ సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యురాలు మడివి మంగ్లీ పోలీసుల ఎదుట గురువారం లొంగిపోయారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 22°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, కొత్తగూడేనికి చెందిన దశరథరామయ్య – కనకమ్మ దంపతులు స్వామివారి నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం అందజేశారు.

ఇన్‌చార్జ్ ప్రధానార్చకుడిగా రామస్వరూప్



భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఇన్‌చార్జ్ ప్రధానార్చకుడిగా కోటి రామ స్వరూపేనకు బాధ్యతలు అప్పగిస్తూ ఈఓ రమాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానార్చకుడిగా ఉన్న పొడిచేటి సీతారామానుజాచార్యులు సస్పెన్షన్‌లో ఉండడం, ముక్కోటి అధ్యయనోత్సవాలకు సమయం సమీపిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా మరో ప్రధానార్చకుడిగా విజయరాఘవన్ పని చేస్తున్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం నివేదన, హారతి, మంత్రపుష్పం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రజనీకుమారి, వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

బోనస్‌ను సద్వినియోగం చేసుకోండి

- రైతులకు డీఏఓ సూచన



కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న బాబూరావు

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ) : సన్న రకం ధాన్యంపై ప్రభుత్వం ఇచ్చే బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.బాబూరావు సూచించారు. మండలంలోని గుంపెన గ్రామంలో సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యంలో తేమ శాతం 17 వచ్చే వరకు అరబెట్టాలని అన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. అనంతరం అన్నపురెడ్డిపల్లిలో ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకుని మట్టి నమూనాలు సేకరించే విధానాన్ని వివరించారు. వరి కోతల తర్వాత అవశేషాలను తగలబెడితే భూమికి నష్టం చేకూరుతుందని, వాటిని కలియదున్నితే భూసారం పెరుగుతుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ అనూష, ఏఈఓలు సాయిభాను, ప్రశాంత్ పాల్గొన్నారు.

రెండోరోజూ ప్రశాంతంగా రైల్వే ఎన్నికలు

కొత్తగూడెంఅర్బన్: రైల్వేశాఖలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు రెండో రోజైన గురువారం భద్రాచలం రోడ్డు రైల్వేస్టేషన్‌లో ప్రశాంతంగా జరిగాయి. రెండో రోజున 275మంది ఓటు హక్కు వినియోగించుకోగా, మొత్తంగా ఇప్పటివరకు 625 ఓట్లు పోలయ్యాయి. మూడో రోజు శుక్రవారం మిగిలిన 226 మంది ఓటు వేయనున్నారు. ఈ ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం, రైల్వే మజ్దూర్ యూనియన్, ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్లు పోటీ పడుతున్నాయి. ఫలితాలు ఈనెల 12వ వెల్లడించనున్నారు.

ఎర్త్ సైన్సెస్ కావలెను..



కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటుచేసిన భూకంప నమోదు కేంద్రం

ఖనిజాలకు నిలయంగా గోదావరి లోయ

- భూమి పొరల్లో సంఘర్షణతో తరచూ భూకంపాలు
- గతంలో మైనింగ్ కాలేజీ, భూకంప నమోదు కేంద్రాల ఏర్పాటు
- ప్రస్తుత పరిస్థితుల్లో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి డిమాండ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి నదీ తీర ప్రాంతం ప్రాచీన నాగరికతకు, పురాణాలకు నెలవుగా నిలిచింది. పచ్చని అడవులు, బొగ్గు, ఇతర ఖనిజాలు ఈ ప్రాంత సొంతం. దీంతో ఇక్కడున్న ఖనిజాలను వెలికి తీసేందుకు మైనింగ్ కాలేజీ, ఈ ప్రాంతంలో సంభవించే భూకంపాలను గమనించేందుకు సెస్మాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ రెండింటినీ అప్‌గ్రేడ్ చేస్తూ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ఈ అంశాన్ని ఇప్పటికే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు.

1999లో భూకంప కేంద్రం..

గోదావరి లోయ బొగ్గు గనుల ప్రాంతం సెస్మిక్‌జోన్ – 3లో ఉండడంతో ఓ మోస్తరు భూకంపాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా అశ్వారావుపేట నుంచి ములుగు జిల్లాలోని ఏటూరునాగారం వరకు గల ప్రాంతంలోనే ఎక్కువగా భూకంప కేంద్రాలు ఉంటున్నాయి. ఇక్కడి నేల పొరల్లో తరచూ సంఘర్షణలు జరుగుతుండడంతో స్వల్ప స్థాయిలో ప్రకంపనలు వస్తూనే ఉంటాయి. అయితే గమనించదగిన స్థాయిలో మాత్రం 1969లో పర్ణశాల వద్ద వచ్చిన భూకంపం రిక్టర్ స్కేల్‌పై 5.8గా నమోదైంది. దీంతో 1999లో కొత్తగూడెంలో ఉన్న స్కూల్ మైన్స్ కాలేజీ క్యాంపస్‌లో భూకంప తీవ్రత నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ రిక్టర్ స్కేల్‌పై నమోదైన వివరాలు నేరుగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీకి వెళ్తాయి.

1978లోనే మైనింగ్ కాలేజీ..

స్వాతంత్య్రానికి 50 ఏళ్ల ముందు నుంచే ఇల్లెందు, కొత్తగూడెంలో బొగ్గు తవ్వకాలు జరుగుతున్నాయి. అయితే రక్షణ పద్ధతులు పాటిస్తూ ఎక్కువ ఉత్పత్తి సాధించేలా గనుల్లో పని చేసే మానవ వనరులే ఇక్కడ తక్కువ. తొలిదశలో బ్రిటీషర్లు ఇక్కడ సాంకేతిక నిపుణులుగా పని చేస్తే ఆ తర్వాత ధన్‌బాద్ (జార్ఖండ్) కాలేజీ నుంచి కొద్దిమందిని రప్పించారు. పెరుగుతున్న మైనింగ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న మైనింగ్ విభాగాన్ని 1978లో కొత్తగూడెం తరలించారు. ఆ తర్వాత యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌గా మారింది. త్వరలో ఈ కాలేజీ 50వ ఏట అడుగు పెట్టబోతోంది. గడిచిన నాలుగు దశాబ్దాలుగా వేలాది మంది ఇంజనీర్లు ఈ కాలేజీ నుంచి బయటకు వచ్చి దేశ మైనింగ్ అవసరాలకు ఉపయోగపడ్డారు. అయితే నిధుల కొరత, పర్యవేక్షణ లేమి, అధ్యాపకులు రాకపోవడం, ల్యాబ్‌ల ఆధునికీకరణ ఆగిపోవడంతో కొన్నేళ్లుగా ఈ కాలేజీ గత ప్రాభవాన్ని కోల్పోతూ వస్తోంది. ఈ ప్రతికూల మార్పు మరింత ముందుకు సాగకుండా అడ్డుకట్ట వేస్తూ ఈ కాలేజీని యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరముంది.

ఆవిష్కరణలు లేక..

గోదావరి లోయ ప్రాంతం అనేక ఖనిజాలను నిలయంగా ఉంది. లక్ష్మీదేవిపల్లి మండలం మైలారంలో ఒకప్పుడు రాగి గనులు ఉండేవి. ఇల్లెందు నియోజకవర్గం పరిధిలో డోలమైట్ గనులు ఉన్నాయి. విశాఖపట్నం ఉక్కు పరిశ్రమకు ఇక్కడి నుంచే ముడి ఖనిజం వెళుతోంది. బయ్యారంలో ఇనుప గనులు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీతో ఇక్కడున్న గనుల నుంచి ఇనుము తయారు చేయడం ద్వారా పెద్దగా లాభాలు రావనే ఉద్దేశంతో మైనింగ్‌ను ప్రారంభించలేదు. విభజన చట్టంలో హామీ ఉన్నా అది అమలుకు నోచుకోవడం లేదు. గతంలో ఉక్కు బదులు పెల్లెట్ పరిశ్రమ పెడతామని చెప్పినా అది నీటిమూటే అయింది. ఇటుకలు, పెంకుల తయారీకి బయ్యారం – ఇల్లెందు నడుమ లభించే మట్టి అనువుగా ఉండడంతో ఒకప్పుడు ఈ ప్రాంతం పెంకు పరిశ్రమకు కేరాఫ్‌గా ఉండేది. కానీ సరైన పరిశోధనలు జరగక, పాత టెక్నాలజీతో లాభాలు లేక పెంకు పరిశ్రమలు ఒక్కొక్కటిగా మూతపడ్డాయి. కేవలం వలస కార్మికులతో నడిచే ఇటుక బట్టీలే ఇప్పుడు మిగిలాయి.



భద్రాచలం రామాలయ వ్యూ

పీఠం ఎవరికో..?

- రామాలయ ట్రస్ట్‌బోర్డ్‌లో చోటు కోసం పలువురి తహతహ
- వెల్లువెత్తుతున్న దరఖాస్తులు
- ఏ నోట విన్నా పాలకమండలి మాటే
- ప్రజాప్రతినిధులు, మంత్రుల చుట్టూ ఆశావహుల చక్కర్లు

భద్రాచలం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రధాన పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డులో చోటు దక్కించుకునేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఏ నోట విన్నా పాలక మండలి మాటే వినిపిస్తోంది. ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్/ సభ్యుల కోసం ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 10 వరకు దరఖాస్తులకు గడువు విధించింది. అయితే నోటిఫికేషన్ వెలువడిన రెండు, మూడు రోజుల్లోనే పదుల సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. అంతేకాదు.. తమకే అవకాశం కల్పించాలంటూ పైరవీలు కూడా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ పలువురు తిరుగుతుండడంతో ఎవరికి అవకాశం కల్పించాలో అర్థం కాక వారు తల పట్టుకుంటున్నారు.

నలుగురు కలిస్తే అదే చర్చ..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు దాటినా ఇంతవరకూ రామాలయ పాలకమండలిని నియమించలేదు. ఇప్పుడు స్వరాష్ట్రంలో మొదటి ట్రస్ట్ బోర్డ్ ఏర్పాటుకు చర్యలు చేపడుతుండడంతో ఎవరికి వారు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఇందులో పార్టీ నాయకులు, ఆధ్యాత్మిక వేత్తలు, వివిధ వర్గాల వారు, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు పోటీ పడుతున్నారు. గత కొద్ది రోజులుగా ఎక్కడ నలుగురు కలిసినా ట్రస్ట్‌బోర్డుపైనే చర్చ జరుగుతోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు సైతం పీఠం వైపు చూస్తున్నారు. దరఖాస్తుల సమర్పణకు ఈనెల 10 చివరి తేదీ అయినా.. మరో రెండు, మూడు రోజుల వరకు అవకాశం కల్పిస్తారనే ఊహాగానాల నేపథ్యంలో మరి కొంతమంది దరఖాస్తు చేసేందుకు సిద్ధమవుతున్నారు. సమర్పించాల్సిన ధ్రువీకరణ పత్రాల కోసం పరుగులు తీస్తున్నారు. ప్రధానంగా పోలీసుల నుంచి అవసరమైన క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం మీ సేవ, పోలీస్ స్టేషన్‌లలో హడావుడి కనిపిస్తోంది.

పదుల సంఖ్యలో దరఖాస్తులు..

రామాలయ ట్రస్ట్‌బోర్డ్‌లో చైర్మన్‌తో పాటు 14 మంది సభ్యులను నియమించే అవకాశం ఉంది. ఇందులో ఒకరిద్దరు ఎక్స్ అఫిషియో సభ్యులు పోగా మరో 12, 13 మందికి స్థానం దక్కవచ్చు. కాగా, ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 30 మందికి పైగా దరఖాస్తులు సమర్పించారని తెలుస్తోంది. ఇంకా అనేక మంది సమర్పణకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిలో సీపీఎం నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఓ నాయకుడు, గతంలో బీఆర్‌ఎస్‌లో ఉండి ప్రస్తుతం కాంగ్రెస్‌లో పని చేస్తున్న ఓ యువ నాయకుడు తన భార్య పేరిట, కాంగ్రెస్‌కు చెందిన ఓ వస్త్ర వ్యాపారి, వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి సిఫారసుతో మెడికల్ రంగానికి చెందిన ఓ యువనేత, రోటరీ విభాగంలో సేవలందించిన మరో ముగ్గురు ఉన్నారు. వీరే కాకుండా టీడీపీకి చెందిన ఓ నాయకుడు, విద్యాసంస్థలకు చెందిన ప్రముఖుడితో పాటు వివిధ పార్టీల నేతలు, వ్యాపార రంగ ప్రముఖులు కూడా ఉన్నారని సమాచారం. వీరితో పాటుగా మరికొందరు కూడా ధ్రువీకరణ పత్రాల కోసం పరుగులు తీస్తున్నారు. మొత్తంగా చైర్మన్, సభ్యులుగా స్థానం పొందాలని ఆశించే వారి సంఖ్య హాఫ్ సెంచరీకి చేరే అవకాశం ఉంది.

మంత్రులు, ఎమ్మెల్యేలకు తప్పని తలపోటు

దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్, మెంబర్‌గా స్థానం పొందాలంటే సీఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులు అవసరం. దీంతో సీఎంతో సిఫారసు కోసం ఆశావహులు తమతమ మార్గాల్లో పైరవీలకు ప్రయత్నాలు ప్రారంభించారు. జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వద్దకు పలువురు క్యూ కట్టినట్టు సమాచారం. ట్రస్ట్‌బోర్డ్ నియామకంలో ఈ ముగ్గురు కీలకం కానున్నారు. మరి కొందరు ఆశావహులు స్థానిక ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో రాజధాని బాట పట్టారు. ప్రధానంగా భద్రాచలం ఎమ్మెల్యేకు ఈ వ్యవహారం తలపోటుగా మారింది. సిఫారసు కోసం వచ్చిన వారిని నొప్పించలేక వచ్చిన ప్రతి ఒక్కరికీ లేఖలు అందించాల్సి వస్తోంది. దీంతో ఎమ్మెల్యే మద్దతు ఎవరికి ఉందో కూడా అర్థం కాని అయోమయ పరిస్థితి నెలకొంది. భద్రాచలం ఎమ్మెల్యే కోటాలో ఇద్దరు సభ్యులకు అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు, మంత్రుల ప్రధాన అనుచరుల ఆశీస్సులు ఎంత మందికి దక్కుతాయోననేది చర్చనీయాంశంగా మారింది. అయితే.. ఏజెన్సీ చట్టాలు అమలవుతున్న నేపథ్యంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డులో సైతం గిరిజనులకు ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

పరిశ్రమలతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వేదికపై మంత్రి తుమ్మల, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే రాగమయి తదితరులు

- మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్‌లు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- బుగ్గపాడులో ఫుడ్‌పార్క్ ప్రారంభం
- పాల్గొన్న మంత్రి తుమ్మల, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, ఎమ్మెల్యే రాగమయి
- ఎనిమిది కంపెనీలకు స్థల కేటాయింపు పత్రాలు

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో మినీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుచేసి మహిళలను పారిశ్రామికంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దిద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. సత్తుపల్లి మండలం బుగ్గపాడులో మెగా ఫుడ్‌పార్క్‌తో పాటు అందులో కోల్డ్‌స్టోరేజ్, వేర్‌హౌస్, ప్యాక్‌హౌస్, డ్రైఫ్రూట్స్, వెజిటబుల్స్ ప్రాసెసింగ్ యూనిట్లను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ టి.నిర్మల జగ్గారెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. అలాగే, ఎనిమిది మంది పారిశ్రామికవేత్తలకు ఫుడ్‌పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు భూమి కేటాయింపు పత్రాలు అందజేశారు.

శిక్షణ కూడా ఇప్పిస్తాం...

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఏడాది పాలన విజయోత్సవ కార్యక్రమాల్లో ఉన్నందున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నూతన రెవెన్యూ విధానం రూపకల్పనలో పాలుపంచుకుంటున్నందున మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇక్కడకు రాలేకపోయారని చెప్పారు. మహిళలు చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తే హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఉమ్మడి ఏపీ ముఖ్య మంత్రి వైఎస్సార్ బుగ్గపాడులో ఫుడ్‌పార్క్‌కు శంకుస్థాపన చేస్తే టీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కాగా, జిల్లాలో గ్రానైట్, జిన్నింగ్, రైస్‌మిల్లులు తదితర పరిశ్రమలు 2,300కు పైగా ఉన్నందున మరింత చెందేలా అభివృద్ధి ఐటీ, పరిశ్రమల స్థాపనకు నిరుద్యోగ యువత ముందుకు రావాలని సూచించారు. అలాగే, మహిళలతో ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ పార్కుకు అవసరమైన స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

రైతులకు అదనపు ఆదాయం

జిల్లాలో ఆయిల్‌పామ్, బొప్పాయి, జామ, కోకో, కొబ్బరి పంటలు పండుతున్నందున ఇవి పాడవకుండా రైతులకు ఎక్కువ ఆదాయం వచ్చేలా ఫుడ్ పార్క్ ఉపయోగపడుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులు నష్టపోవద్దనే భావనతో ప్రభుత్వం ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు నిర్ణయించిందన్నారు. వైఎస్సార్ శంకుస్థాపన చేసిన ఈ ఫుడ్‌పార్క్‌ను నాబార్డు ద్వారా సుమారు రూ.100 కోట్లకుపైగా నిధులు తెచ్చి అభివృద్ధి చేశామని చెప్పారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఫుడ్‌పార్కు పరిధిలో లక్ష ఎకరాల వరకు భూమి ఉన్నందున ఫుడ్‌పార్క్‌లోని పరిశ్రమల ద్వారా ఇక్కడ పండించే పంటలు ప్రాసెస్ చేయొచ్చని తెలిపారు. జిలాల్లో అదనంగా 6వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్, 2వేల ఎకరాల్లో పండ్లు, కూరగాయల పంటల సాగుకు కృషి చేస్తున్నామన్నారు. టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పాలసీ అమలు చేస్తోందని తెలిపారు.

థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయండి

సత్తుపల్లి సింగరేణిలో నాణ్యమైన బొగ్గు అందుబాటులో ఉన్నందున ఇక్కడ థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మంత్రులను కోరారు. అంతేకాక బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మెగాఫుడ్ పార్కు ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు ప్రాతినిధ్యం వహించిన ఈ నియోజకవర్గం ఎమ్మెల్యేగా తాను గెలవడం గర్వంగా ఉందన్నారు. ఇంకా ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగులు, హస్తకళల సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, టీజీఐఐసీ ఈడీ ఏ.పవన్‌కుమార్, సీఈ వినోద్‌కుమార్, జెడ్‌ఎం మహేశ్వర్, పరిశ్రమల శాఖ కమిషనర్ మల్సూర్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల్లో తిమ్మంపేట లిఫ్ట్ ప్రారంభం

- టీఎస్‌ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు
- ట్రయల్ రన్‌ను పరిశీలించిన చైర్మన్, ఎమ్మెల్యే



డిశ్చార్జ్ పాయింట్ వద్ద నీటిని పరిశీలిస్తున్న చైర్మన్ మువ్వా, ఎమ్మెల్యే జారె

ములకలపల్లి: ఇంతకాలం నిరుపయోగంగా ఉన్న తిమ్మంపేట ఎత్తిపోతల పథకాన్ని పది రోజుల్లో ప్రారంభించి రైతులకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఐడీసీ) చైర్మన్ మువ్వా విజయబాబు అన్నారు. తుమ్మలకుంట శివారులో రూ.9 కోట్ల వ్యయంతో నిర్మించిన తిమ్మంపేట లిఫ్ట్ ఇరిగేషన్ ట్రయల్‌రన్‌ను గురువారం చేపట్టగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి ఆయన పరిశీలించారు. ఇరిగేషన్ ఈఈ సురేశ్ మోటార్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ.. మోటార్ల సామర్థ్యానికి సరిపడా నీరు నిల్వ ఉండేలా చెక్‌డ్యాం నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పుట్టతోగు శివారులోని డిశ్చార్జ్ పాయింట్ వద్ద నీటిని పరిశీలించారు. కార్యక్రమంలో దమ్మపేట మార్కెట్ చైర్‌పర్సన్ వాసం రాణి, ఇరిగేషన్ డీఈ మోతీలాల్, ఏఈలు గఫూర్‌పాషా, వెంకటరామన్, ఎంపీడీఓ రేవతి, ఎంపీఓ లక్ష్మయ్య, కాంగ్రెస్ నాయకులు తాండ్ర ప్రభాకర్‌రావు, బత్తుల అంజి, నాగళ్ల వెంకటేశ్వరరావు, గాడి తరుపతిరెడ్డి, బాల అప్పారావు, కారం సుధీర్, పాలకుర్తి సుమిత్, సురభి రాజేశ్, కటికనేని ఆదిత్య తదితరులు పాల్గొనగా సమస్యలపై మాస్‌లైన్, సీపీఎం నాయకులు నూపా భాస్కర్, గౌరి నాగేశ్వరరావు వినతిపత్రాలు అందజేశారు.

గిరిజనులకు పోడు హక్కుపత్రాలు



హక్కు పత్రాలు అందజేస్తున్న పీఓ

భద్రాచలంటౌన్: జిల్లాలోని పలు మండలాల్లో పోడు సాగు చేస్తున్న గిరిజనులకు భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ గురువారం హక్కు పత్రాలు అందజేశారు. అన్నపురెడ్డిపల్లి మండలం కట్టుగూడెం, చండ్రుగొండ మండలం రామక్క బంజర గ్రామాలకు చెందిన 70 మంది ఆదివాసీ కోయ, నాయకపోడు రైతులకు 220 ఎకరాల పోడు భూమికి సంబంధించిన హక్కు పత్రాలు పంపిణీ చేశారు. న్యాయవాదులు శ్రీనివాసరావు, చీమల నరసింహారావు, చందా హనుమంతరావు, సున్నం రమేష్, కొర్సా నరేష్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించడం ఆదర్శనీయం..

భద్రాచలం: దివ్యాంగ బాలబాలికలు క్రీడల్లో రాణించడం ఆదర్శనీయమని పీఓ రాహుల్ అన్నారు. వికాసం పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటల పోటీలు నిర్వహించగా విజేతలు సందీప్, వైశాలి, అన్నపూర్ణ, అనిత, సాగర్, భానుశ్రీ, దీపికతో పాటు ఉపాధ్యాయులను అభినందించారు. ప్రిన్సిపాల్ అరుణకుమారి, ఉపాధ్యాయులు అరుణ, ప్రియాంక, కృష్ణవేణి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్దీపకం లక్ష్యాల సాధనకు కృషి..

గిరిజన విద్యార్థుల నైపుణ్యాల పెంపునకు చేపడుతున్న ఉద్దీపనం కార్యక్రమాల లక్ష్యాల సాధనకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని పీఓ రాహుల్ సూచించారు. భద్రాచలంలోని బీఈడీ కళాశాలలో ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల హెచ్‌ఎంలు, వార్డెన్లతో సమావేశమైన ఆయన పదో తరగతి విద్యార్థుల సన్నద్ధతపై సూచనలు చేశారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, అధికారులు రమణయ్య, శ్రీరాములు, జహీరుద్దీన్, అశోక్‌కుమార్, చంద్రమోహన్, సత్యవతి, రాధమ్మ, అలివేలు మంగతాయారు, భాస్కరన్, ఉదయ్‌కుమార్, మునీర్‌పాషా, హరికృష్ణ పాల్గొన్నారు. అలాగే, హైదరాబాద్ నుంచి గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ శరత్ నిర్వహించిన వీసీకి కూడా హాజరైన పీఓ విద్యార్థుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

జాతీయ జూనియర్ అథ్లెటిక్స్‌కు ఎంపిక

కొత్తగూడెంఅర్బన్: అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 11 వరకు జరగనున్న జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి ఎనిమిది మంది ఎంపికయ్యారని అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ తెలిపారు. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో జరిగే ఈ పోటీల్లో జిల్లాలోని భద్రచలానికి చెందిన అమ్రిన్, శ్రీవిద్యదొర, శ్రీతేజ, కొత్తగూడెనికి చెందిన వేదశ్రీ, ఎం.సంగీత, ఎం.ఇందు, పాల్వంచకు చెందిన అభినవనాయక్, కాచనపల్లికి చెందిన పి.కరుణ రాష్ట్ర జట్టులో ఆడుతారని వివరించారు. కాగా, ఎంపికైన అథ్లెట్లతో పాటు కోచ్‌లు పి.నాగేందర్, జె.నాగరాజు, జె.గిరిప్రసాద్, మల్లికార్జున్‌ను డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి.యుగంధర రెడ్డి అభినందించారు.

క్లుప్తంగా

ధాన్యం కాంటాలు ప్రారంభం

'సాక్షి' కథనానికి స్పందన



లింగాలపల్లిలో గిరిజన రైతుల ధాన్యం కాంటా వేయిస్తున్న జీసీసీ నిర్వాహకులు

దమ్మపేట: మండల పరిధిలోని లింగాలపల్లి శివారు కల్లాల్లో గిరిజన రైతులు ఆరబోసిన వరి ధాన్యం కాంటాలను గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. 'ధాన్యం కొనుగోళ్లలో జాప్యం' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి కొనుగోలు కేంద్రం నిర్వాహకులు(జీసీసీ), సివిల్ సప్లయీస్ అధికారులు స్పందించారు. లింగాలపల్లి గ్రామ శివారులోని కల్లాల వద్ద ధాన్యం కాంటాలు వేయించి కొనుగోళ్లు ప్రారంభించారు. రైతులను ఇబ్బంది పెట్టే ఉద్దేశం తమకు లేదని, ధాన్యం తేమ శాతం 17 లోపు ఉన్న ప్రతి రైతు ధాన్యాన్ని, తప్పకుండా కొనుగోలు చేస్తామని జీసీసీ మేనేజర్ పాపారావు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై హర్షం వ్యక్తం చేసిన లింగాలపల్లి గిరిజన రైతులు సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏఐటీయూసీ కృషితోనే కార్మిక హక్కులు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

పాల్వంచ: నేడు కార్మికులు అనుభవిస్తున్న హక్కులన్నీ ఏఐటీయూసీ కృషి ఫలితమేనని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్ అన్నారు. సీపీఐ కార్యాలయంలో బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతులు గురువారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ జాతీయ కనీస వేతనం చట్టం ప్రకారం అసంఘటిత కార్మికులందరికీ సామాజిక భద్రత ప్రయోజనాలు కల్పించాలన్నారు. నాయకులు నరాటి ప్రసాద్, ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, వేల్పుల మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, కడారి రాములు, వెంకట స్వామి, సమ్మయ్య, లావణ్య, అన్నారపు వెంకటేశ్వర్లు, గిరి, ఇట్టి వెంకట్రావ్, ధారవత్ గోపి, కోరె కృష్ణ, పున్నారావు, నల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అత్యధిక పనిదినాలు

పాల్వంచరూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో జిల్లాలోనే పాల్వంచ మండలంలో దివ్యాంగులకు అత్యధిక పనిదినాలు కల్పించారు. 2023–2024 సంవత్సరంలో జిల్లాలో 3,224 మంది దివ్యాంగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. పాల్వంచ మండలంలో 213 మంది దివ్యాంగ కూలీలు పనికోసం పేర్లు రిజిస్టర్ చేసుకోగా 92 మందికి పనులు కల్పించారు. 4,853 పని దినాలు కల్పించడంతో పాల్వంచ ప్రథమస్థానంలో నిలిచింది. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఉపాధి సిబ్బంది రంగా, లక్ష్మి, రజిత, లక్ష్మణ్, సౌజన్య, చంటి, దివ్యాంగ కూలీలను బుధవారం ఘనంగా సన్మానించారు. జిల్లా అదనపు కలెక్టర్ విద్యాచందన ప్రశంసా పత్రం అందజేశారు.

వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి జన్మదిన వేడుకలు

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పుట్టినరోజు సందర్భంగా లక్ష్మీదేవిపల్లి మండలంలోని రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మొక్కలు నాటారు. డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలాజీ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ స్పందన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది అంకితభావంతో ప్రజలకు సేవలు అందించాలన్నారు.

లారీలను అడ్డుకున్న గిరిజనులు

పాల్వంచ: ఐటీడీఏ ఎంపిక చేసిన గిరిజనులకు కేటీపీఎస్ నుంచి బూడిద తరలింపునకు అవకాశం కల్పించాలని రెండో రోజు గురువారం కూడా గిరిజన సొసైటీ సభ్యులు ఆందోళన నిర్వహించారు. బూడిద లారీలను అడ్డగించారు. దీంతో పోలీసులు, కేటీపీఎస్ ఎస్‌పీఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకుని నచ్చజెప్పడంతో లారీలను వదిలారు. ఈ సందర్భంగా గిరిజన సొసైటీ అధ్యక్షుడు చందర్ మాట్లాడుతూ అగ్రిమెంట్ చేయకుండా యాజమాన్యం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మురళీనాయక్, రవి, రాజు, నరేష్, అశోక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు దుర్వినియోగం

చుంచుపల్లి: కొత్తగూడెం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సీసీ కెమెరాలు దుర్వినియోగమైనట్లు గురువారం ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో కొంత చర్చనీయాంశంగా మారింది. దీనిపై సంబంధిత విద్యాశాఖ అధికారులను సంప్రదించగా.. తమ పరిశీలనలో అలాంటిది ఏమీ లేదని తేలిందని తెలిపారు.

'పెదవాగు'లో కబ్జా!

పెదవాగు ప్రాజెక్ట్ భూములు కబ్జా చేస్తున్నారు. వందల ఎకరాల్లో ఉన్న శిఖంతోపాటు ప్రాజెక్ట్ లోతట్టు ప్రాంతాన్నీ ఆక్రమిస్తున్నారు. ఆ భూముల్లో కొందరు పంటలు సాగు చేస్తుండగా, మరికొందరు కౌలుకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. శిఖంలో పంటలు సాగు చేస్తే ప్రాజెక్ట్‌లో పూడిక పేరుకుపోతుందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

– అశ్వారావుపేటరూరల్



శిఖం భూములు ఆక్రమించి సాగు చేస్తున్న దృశ్యం

ప్రాజెక్ట్ శిఖం, లోతట్టు భూములు ఆక్రమణ

- దర్జాగా 300పైగా ఎకరాల్లో పంటల సాగు
- దున్నడంతో వర్షాలకు పూడిక పేరుకుపోయే అవకాశం
- నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుందని ఆయకట్టు రైతుల ఆందోళన

అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి సమీపంలో 1970లో అప్పటి సీఎం జలగం వెంగళరావు హయాంలో పెదవాగు ప్రాజెక్ట్ నిర్మించారు. నాటి ఉమ్మడి రాష్ట్రం పరిధిలో అశ్వారావుపేట, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని 16 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్ట్ రూపకల్పన చేశారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 19.3 అడుగులుకాగా, ప్రాజెక్టు శిఖాన్ని 1,200 ఎకరాలు ఉండేలా డిజైన్ చేశారు. కాగా శిఖం భూముల్లో దాదాపు 100 ఎకరాల వరకు గతంలోనే కబ్జాకు గురైనట్లు గుర్తించారు. కబ్జాలపై ఇరిగేషన్ శాఖ చూసీచూడనట్లు వ్యవహరిస్తుండగా ఆక్రమణలు ప్రాజెక్టు లోతట్టు ప్రాంతానికి కూడా పాకాయి.

ఆనకట్టకు గండితో దర్జాగా సాగు

గత జూలై 18న కురిసిన అతిభారీ వర్షాలు, పోటెత్తిన వరద ప్రవాహంతో పెదవాగు ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టకు దాదాపు 250 మీటర్ల దాకా గండ్లు పడి తెగిపోయిన సంగతి తెలిసిందే. దీంతో ప్రాజెక్ట్‌లో ఉన్న నీరంతా గోదావరి పాలు కాగా, ప్రాజెక్టు శిఖమంతా బయటపడింది. దీంతో సమీప గ్రామాలకు చెందిన సుమారు 40 మంది రైతులు దాదాపు 300 ఎకరాల్లో దున్నేసి దర్జాగా పొగాకు, మిర్చి, పుచ్చ, జనుము, మినుము పంటలను సాగు చేస్తున్నారు. మరికొందరు ప్రాజెక్ట్ శిఖాన్ని కౌలుకు కూడా ఇచ్చారు. కాగా భూముల ఆక్రమణతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. శిఖం భూముల్లో పంటల సాగు చేయడం వల్ల వర్షాలకు మట్టి అంతా ప్రాజెక్ట్‌లోకి చేరి పూడిక పేరుకుపోతుందని, నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టకు గండ్లు పండి సాగునీటి నిల్వ తగ్గిపోయింది. తాత్కాలికంగా నిర్మించిన రింగ్ బండ్ భారీ వర్షం వస్తే ఉంటుందో, కొట్టుకుపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

ఫిర్యాదు చేసినా..

శిఖం భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని నెల రోజుల క్రితమే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు పలువురు ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేశారు. నెల రోజులు గడిచినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో ఆగ్రహించి గత ఆదివారం గుమ్మడవల్లి వద్ద ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. కలెక్టర్, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రాజెక్ట్ భూములను ఆక్రమించి చేస్తున్న సాగును అడ్డుకోవాలని కోరుతున్నారు.



ప్రాజెక్టు నీటి నిల్వ ప్రాంతం చుట్టూ సాగు కోసం దున్నిన దుక్కి

ఆక్రమణలతో ప్రాజెక్టుకు ముప్పు



శిఖం, లోతట్టు భూముల ఆక్రమణతో పెదవాగు ప్రాజెక్ట్‌కు రానున్న రోజుల్లో ముప్పు జరిగే అవకాశం ఉంది. ఆనకట్టకు గండి పడిన నాటి నుంచే కొందరు వ్యక్తులు అక్రమంగా చొరబడి శిఖం ప్రాంతాన్ని దున్నేశారు. కొద్ది రోజుల క్రితం విత్తనాలు సైతం నాటారు. ఇంకొందరు సొంత భూముల్లా కౌలుకు ఇస్తున్నారు.

– చిమడబోయిన శ్రీను, ఆయకట్టు రైతు, గుమ్మడవల్లి

తక్షణమే చర్యలు తీసుకోవాలి



పెదవాగు ప్రాజెక్టు భూముల్లో సాగుతున్న ఆక్రమణలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టు భూముల్లో సాగు చేయడం వల్ల పూడిక మట్టి పేరుకుపోయి, నీటి నిల్వ తగ్గిపోయే ప్రమాదం ఉంది. భవిష్యత్‌లో ఆయకట్టు రైతులకు సాగునీరు సక్రమంగా అందే పరిస్థితి ఉండదు.

– వీరంకి సాయిబాబు, ఆయకట్టు రైతు, గుమ్మడవల్లి

త్వరలోనే ట్రెంచ్ తీయిస్తాం

పెదవాగు ప్రాజెక్టు శిఖం భూముల వరకు సరిహద్దులు గుర్తించే పనులు చేపడతాం. ఆ తర్వాత ప్రాజెక్టు చుట్టూ శిఖం భూముల్లో రెండు మీటర్ల లోతు, వెడల్పు కొలతలతో కందకాన్ని తీసేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదన చేస్తాం. శిఖం, లోతట్టు భూముల్లో పంటలు సాగు చేస్తే సహించేది లేదు. ఇప్పటికే ఆక్రమణలపై పోలీసులకు ఫిర్యాదులు చేశాం. త్వరలోనే ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం.

– కృష్ణ, ఇరిగేషన్ డీఈఈ, అశ్వారావుపేట

వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం

సర్వజన ఆస్పత్రిలో తనిఖీ చేసిన ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంరూరల్: జిల్లా సర్వజన ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర ఆస్పత్రుల ల్యాబ్‌లకు పంపిస్తూ రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. గురువారం ఆయన జిల్లా సర్వజన ఆస్పత్రిని తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. 39 మంది వైద్యులకు గాను 12 మంది వైద్యులే విధులకు హాజరుకావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు రిజిస్టర్ నిర్వహణలో లోపాలను గుర్తించి సూపరింటెండెంట్‌ను మందలించారు. వైద్యులు, వైద్య సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు అర్థమవుతోందన్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన ఎందుకు పాటించటంలేదని ప్రశ్నించారు. వైద్యసేవల్లో లోపాల కారణంగా ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోందన్నారు. ఆస్పత్రిలో నిఘా విభాగం ఏర్పాటు చేస్తామని, విచారణకు ఆదేశిస్తామని తెలిపారు. వారానికోసారి ఆస్పత్రిని సందర్శిస్తానని పేర్కొన్నారు. వైద్య పరికరాలు, మందులు, సిబ్బంది సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెపాపరు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాష, టీజీఎస్ జిల్లా నాయకుడు భూక్యా శ్రీనివాస్, నాయకులు నేరెళ్ల రమేష్, పల్నాటి ప్రశాంత్, కె.జోసెఫ్ తదితరులు ఉన్నారు.

ఉద్యమ భాస్కరుడు అస్తమయం

- మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన ఎంపీ రవిచంద్ర
- కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించిన కేటీఆర్, కవిత



భాస్కర్ పాడె మోస్తున్న ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే రేగా

కొత్తగూడెంఅర్బన్: మలిదశ ఉద్యమ భాస్కరుడు అస్తమించాడని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. పోరాటస్ఫూర్తితో ముందుకు సాగి రాష్ట్ర సాధనలో తన వంతు కృషి చేశాడని కొనియాడారు. తెలంగాణ ఉద్యమకారుడు మోరే భాస్కర్ అనారోగ్యంతో బుధవారం మృతిచెందగా, గురువారం ఎంపీ కొత్తగూడెం వచ్చి మృతదేహాన్ని సందర్శించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భాస్కర్ మృతి ఉద్యమ పార్టీకి తీరని లోటని అన్నారు. అనంతరం మృతదేహాన్ని జిల్లా పార్టీ కార్యాలయానికి తరలించి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ నేత కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత సంతాపం వ్యక్తం చేసి ఫోన్‌లో భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నివాళులర్పించిన నాయకులు, పట్టణ ప్రముఖులు

పట్టణ ప్రముఖులు, నాయకులు భాస్కర్ మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించినవారిలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వనమా రాఘవేందర్, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, ఉర్దూఘర్ కమిటీ మాజీ చైర్మన్ అన్వర్‌పాషా, మాజీ సర్పంచ్ మోతి, టీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు సంకు బాపన అనుదీప్, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి బొమ్మిడి శ్రీకాంత్, గౌస్, మజీద్, సురేందర్, రెడ్డి బ్రదర్, హుస్సేన్, రాజేందర్, అశోక్, కోయాడ శ్రీను, పితాని సత్యనారాయణ, పిల్లి కుమార్, నగేష్, షెరీఫ్, రాము, అవునూరి చంద్రయ్య, బొమ్మిడి రమాకాంత్, బందుగుల శ్రీధర్, వివిధ సంఘాల నాయకులు, ఉద్యమకారులు, పట్టణ ప్రముఖులు, వివిధ పార్టీ నాయకులు ఉన్నారు. అంతిమయాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తదితరులు పాడె మోసి కడసారి నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో జీపీ కార్మికుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బూర్గంపాడు: విధి నిర్వహణలో విద్యుదాఘాతానికి గురై గ్రామపంచాయతీ తాత్కాలిక కార్మికుడు మృతిచెందిన విషాదకర ఘటన మండల పరిధిలోని ఉప్పుసాక గ్రామపంచాయతీలో గురువారం జరిగింది. బూర్గంపాడు పోలీసుల కథనం ప్రకారం .. ఉప్పుసాక గ్రామంలో ఓ చేతిపంపు మరమ్మతులు చేస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన భూక్యా వెంకటేశ్వర్లు(33) చేతిపంపు బోరులోకి ఐరన్ పైపులు దింపుతున్న క్రమంలో పైన ఉన్న విద్యుత్ లైన్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి భద్రమ్మ గ్రామపంచాయతీ వర్కర్‌గా పనిచేస్తూ ఐదురోజుల క్రితమే ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి గ్రామపంచాయతీలో రోజువారీ వర్కర్‌గా వెంకటేశ్వర్లు పనిచేస్తున్నాడు. కాగా వెంకటేశ్వర్లు అయ్యప్పస్వామి మాలధారణలో ఉన్నాడు. మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఎస్‌ఐ రాజేష్, విద్యుత్ శాఖ ఏఈ హారిక పటేల్, లైన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఫోర్‌మెన్ ఆదినారాయణ, లైన్‌మెన్ జగన్మోహన్‌రెడ్డి ఘటనా ప్రాంతానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి భార్యకు గ్రామపంచాయతీలో మల్టీ పర్పస్ వర్కర్‌గా ఉద్యోగం కల్పిస్తామని మండల అధికారులు హామీ ఇచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళా మావోయిస్టు లొంగుబాటు

వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్‌రాజు



ప్రభుత్వం తరఫున చెక్కు అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంఅర్బన్: నిషేధిత సీపీఐ మావోయిస్ట్ పార్టీ, క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘం (కేఏఎంఎస్) సౌత్ బస్తర్ డివిజినల్ కమిటీ సభ్యురాలు మడివి మంగ్లీ పోలీసుల ఎదుట లొంగిపోయింది. ఎస్పీ రోహిత్‌రాజు గురువారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడు పీఎస్ పరిధిలోని మెట్టగూడేనికి చెందిన మంగ్లీ 2003లో మావోయిస్టు పార్టీలో చేరింది. అప్పటి నుంచి మావోయిస్టు పార్టీకి చెందిన చైతన్య నాట్య మండలిలో, కిష్టారం ఏసీ, 2009 ఉంచి 2015 వరకు ఏసీఎంగా పనిచేసింది. అనంతరం కేఏఎంఎస్ ఇన్‌చార్జి, పాలగూడెం, గొమ్ముగూడ, ఇట్టగూడ, మీనగట్ట, జలేరుగూడ గ్రామాల ఆర్‌పీసీల బాధ్యతలు నిర్వర్తించింది. 2008లో పార్టీలోనే గొల్లపల్లి ఎల్‌ఓసీ కమాండర్ కరటం రాజేష్‌తో వివాహం జరిగింది. 2007, 2009 సంవత్సరాల్లో కుంట ఠాణా పరిధిలో ఇంజరం, పిడిమెల్ గ్రామాల వద్ద భద్రత బలగాలపై దాడి చేసిన ఘటనల్లో మంగ్లీ పాల్గొన్నది. కొంతకాలంగా మావోయిస్ట్ పార్టీ ఆదివాసీ ప్రజల్లో ఆదరణ కోల్పోవడంతో మంగ్లీ లొంగిపోయిందని ఎస్పీ తెలిపారు. అనంతరం ప్రభుత్వం తరఫున ఆమెకు ఆర్థికసాయం చెక్కును అందించారు.

విత్తన డీలర్‌పై కేసు నమోదు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : నకిలీ విత్తనాలు అంటగట్టిన డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ప్రసాద్ గురువారం తెలిపారు. పోలీసులు, బాధిత రైతుల కథనం ప్రకారం.. రాజాపురం గ్రామానికి చెందిన నలుగురు రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సత్తుపల్లిలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో 31 బస్తాల వరిధాన్యం విత్తనాలు కొనుగోలు చేసి సేద్యం చేశారు. అయితే ఎకరాకు 3 నుండి 5 బస్తాల ధాన్యం దిగుబడి తగ్గింది. అధికంగా బెరుకులు వచ్చాయి. పంటనష్టపోయిన రైతులు రశీదులతో పోలీసులను ఆశ్రయించారు. రశీదులో లాట్ నంబర్‌ను డీలర్ మార్చి ఇచ్చినట్లు పోలీసులు గుర్తించి డీలర్ సాయికృష్ణపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

తండ్రి, బాబాయిపై..

ఇల్లెందు: కూతురు ఫిర్యాదు మేరకు తండ్రి, బాబాయిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇల్లెందు పట్టణంలోని నంబర్–2 బస్తీకి చెందిన యువతి రామగిరి నవ్య తన తండ్రి పరమేష్, బాబాయి శ్రీనివాస్‌లు కొట్టి తిట్టారంటూ ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

లారీ ఢీకొని పూజారి మృతి

ఖమ్మంక్రైం: కుమార్తెను చూసేందుకు బైక్‌పై వెళ్తున్న పూజారిని గురువారం లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొణిజర్ల మండలం అమ్మపాలెంకు చెందిన మారుతీ కిషోర్‌శర్మ(55) దేవాలయంలో అర్చకుడిగా పనిచేస్తుండగా ఆయనకు ముగ్గురు పిల్ల లు ఉన్నారు. ఓ కూతురు ఖమ్మంలో ఉండడంతో ఆమెను చూసేందుకు బైక్‌పై బయలుదేరిన ఆయన కొత్త బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన లారీ ఢీకొనటంతో టైర్ల కిందపడి నలిగిపోయిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు సమాచారం అందుకున్న ఖమ్మం టూటౌన్ పోలీసులు ఆయన అల్లుడు వశిష్టకు సమాచారం ఇచ్చి అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో టైర్ల కింద నుంచి మృతదేహాన్ని బయటకు తీసి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.

మిర్చి పంటపై విషప్రయోగం!



విషప్రయోగం కారణంగా ఎర్రబారుతున్న మిర్చిపంట

చంద్రుగొండ : మిర్చిపంటపై విషప్రయోగం జరగడంతో పచ్చని పంటంతా వడలిపోతోంది. దీంతో బాధిత రైతు బోరున విలపిస్తున్నాడు. మండలంలోని రావికంపాడు గ్రామానికి చెందిన కౌలు రైతు ఇమ్మడి శ్రీను మూడెకరాల్లో మిర్చి సాగుచేశాడు. ఏపుగా పెరిగిన పంట పూత పిందె దశలో ఉంది. ఈ క్రమంలో ఒక్కసారిగా పచ్చని పంటంతా వడలిపోతుండటంతో పంటపై విషప్రయోగం జరిగిందని బాధితరైతు అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. చీడపీడలకు మందు పిచికారీ చేసేందుకు ఒకరోజు ముందుగా పట్టి ఉంచుకున్న రెండు డ్రమ్ముల నీటిలో కలుపుమందు కలిపి ఉంటారని లేదా రాత్రి వేళ కలుపుమందు పంటపై పిచికారీ చేసి ఉంటారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. వడలిపోతున్న పంటను చూసి బాధితుడు రోదిస్తున్న తీరు చుట్టుపక్కల రైతులను సైతం కంటతడి పెట్టిస్తోంది.

రూ.7 లక్షల వరకు నష్టం



నాపై కక్ష కట్టిన వారే పంటపై విషప్రయోగం చేసి ఉంటారు. నాకు ఒకరిద్దరిపై అనుమానం ఉంది. భూమికౌలు, పెట్టుబడి, దిగుబడి కలుపుకుంటే రూ.7 లక్షల వరకు నష్టం వాటిల్లింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తా. నాకు న్యాయం చేయాలి.

– ఇమ్మడి శ్రీను, బాధిత రైతు

హిజ్రాలపై దాడి



గాయాన్ని చూపుతున్న హిజ్రా

దుమ్ముగూడెం : మండలంలోని బుర్రవేముల గ్రామ శివారులో ముగ్గురు హిజ్రాలపై గురువారం దాడి జరిగింది. హిజ్రాలు తెలిపిన వివరాల ప్రకారం.. బుర్రవేముల శివారులో హిజ్రాలు వాహనాలు ఆపి డబ్బులు అడుక్కుంటున్నారు. ఈ క్రమంలోనే స్కూటీపై వస్తున్న దంపతులను ఆపారు. డబ్బులు అడుగగా స్కూటీపై వచ్చిన వ్యక్తి దాడి చేశాడు. దీంతో హిజ్రాకు గాయమైంది. డబ్బులు అడిగినందుకే తిడుతూ తమపై దాడి చేశాడని హిజ్రాలు తెలిపారు.

యువకుడిపై స్నేహితుల దాడి

కొత్తగూడెంఅర్బన్: ద్విచక్ర వాహనం అడిగితే ఇవ్వనందుకు యువకుడిపై అతని స్నేహితులు దాడి చేశారు. స్థానికులు, వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని దుర్గనబస్తీకి చెందిన జయరాజ్‌ను బాబుక్యాంపునకు చెందిన తరుణ్, దుర్గనబస్తీకి చెందిన బన్ను కలిసి ద్విచక్ర వాహనం ఇవ్వాలని అడిగారు. జయరాజ్ ఇవ్వకపోవడంతో అక్కడ ఉన్న రాయితో జయరాజ్ తల పగులగొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఫీజు కట్టలేదని బైక్ లాక్కున్నారు..

శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపాల్‌పై డీఐఈఓకు బాధితుడి ఫిర్యాదు



డీఐఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి రాజేష్

ఇల్లెందురూరల్: దౌర్జన్యం చేసి తన ద్విచక్ర వాహనం బలవంతంగా లాక్కెళ్లిన ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ గొగ్గెల రాజేష్ అనే విద్యార్థి గురువారం డీఐఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం ఇసుక మేది గ్రామానికి చెందిన రాజేష్ ఇల్లెందులోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ సీఈసీ పూర్తి చేశాడు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో తల్లిని, ద్వితీయ సంవత్సరంలో తండ్రిని కోల్పోయి అనాథగా మారాడు. ఈ క్రమంలో ప్రభుత్వం నుంచి వచ్చిన ఇంటర్మీడియట్ స్కాలర్‌షిప్ డబ్బులను తండ్రి కర్మకాండలకు వినియోగించుకున్నాడు. ఈ కారణంగా స్కాలర్‌షిప్ డబ్బులను కళాశాలలో చెల్లించలేదు. కాగా స్కాలర్‌షిప్ మొత్తాన్ని తనకు చెల్లించాలని కళాశాల ప్రిన్సిపాల్ ఒత్తిడి చేశాడని విద్యార్థి ఆరోపించాడు. రెండు రోజుల క్రితం బైక్‌పై ఇల్లెందుకు వచ్చిన తనను ప్రిన్సిపాల్ అసభ్యపదజాలంతో దూషించి, బైక్ లాక్కెళ్లాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

రెండో రోజూ యువతి ఆందోళన

జూలూరుపాడు: న్యాయం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో ఓ యువకుడి ఇంటి ఎదుట యువతి చేపట్టిన దీక్ష గురువారం రెండో రోజూ కూడా కొనసాగింది. బాధిత యువతి కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం సంపత్‌నగర్‌కు చెందిన ఆమని పాల్వంచ మండలం పుల్లయ్యగూడెంలో ఉన్న తన సోదరి వద్ద ఉంటోంది. ఆమెకు, జూలూరుపాడు న్యూకాలనీకి చెందిన ఇల్లంగి వినోద్‌తో గత మే నెలలో పెళ్లి చూపులు జరిగాయి. ఇరుకుటుంబాలకు నచ్చాక కట్నకానుకల విషయంలో పెళ్లి సంబంధం క్యాన్సిల్ అయింది. ఆ తర్వాత 10 రోజులకు వినోద్ ఫోన్ చేసి.. నిన్ను తప్ప ఎవరినీ పెళ్లి చేసుకోనని ఆమనితో చెప్పాడు. అప్పటి నుంచి పుల్లయ్యగూడెంలోని యువతి అక్క వాళ్ల ఇంటికి వినోద్ వెళ్లి వస్తుండటంతో వారి మధ్య ప్రేమబంధం బలపడింది. ఇటీవల వినోద్ మరో యువతితో పెళ్లికి సిద్ధం కాగా ఆమని కొత్తగూడెం మహిళా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. అయితే పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఆమని వచ్చి వినోద్ ఇంటి ఎదుట ఆందోళన చేపట్టింది. తనకు వివాహం చేసి న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదన వ్యక్తం చేసింది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అయినా న్యాయం జరగదనే నిరసన దీక్ష చేపట్టినట్లు తెలిపింది. వినోద్ బంధువులు తనపై దాడి చేశారని చెప్పింది. కాగా పోలీసులు వచ్చి బాధితురాలిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు ఇచ్చినట్లు బాధితురాలు తెలిపింది. ఇరు కుటుంబాలతో మాట్లాడిన పోలీసులు రెండు రోజుల తర్వాత రావాలని సూచించారు. ఈ సమయంలో ఆమని స్పృహ కోల్పోవడంతో కొత్తగూడెం ఆస్పత్రికి తీసుకెళ్లారు.